# అనుభవం...



## లైబీరియాలో నవ్వులు విరజిల్లుతున్న ఎల్విపిఇఐ డాక్టర్లు





తన క్షీణిస్తున్న చూపువలన 50 ఏళ్ళ ట్రక్ డ్రైవర్ రాబర్ట్ జుసు వాహనం నడపడం ఆపివేయవలసివచ్చింది. 34 ఏళ్ళ సమౌసా కీయ్టా పుట్టుకనుంచీ ఉన్న మెల్లకన్ను వలన నిరంతరంగా అవహేళనను ఎదుర్కొన్నాడు. ఫ్లోరెన్స్, ఎలీషా మరియు అమినాటా జన్మసిద్ధ శుక్లంతో పుట్టారు. వారి భవిష్యత్తుగురించి తల్లిదండ్రులు ఆందోళన చెందేవారు. వీరందరికీ మొన్రోవియాలో ఉన్న లైబీరియా ఐ సెంటర్లో విజయవంతంగా అత్యాధునిక శస్త్రచికిత్సలు చేసారు. ప్రపంచంలో అత్యంత ముఖ్యమైన బహుమతి కన్ను అని రాబర్ట్ విశ్వసిస్తాడు. చూపును తిరిగిపొందినందుకు అమితానందంతో అతను మరింత తృప్తికరమైన వృత్తికై ఉవ్విళ్ళూరుతున్నాడు. సామాజిక కార్యకర్త సమౌసా తన మెల్లకన్నును సరిచేసినందుకు తన డాక్టరుకు తగినంత కృతజ్ఞతలు చెప్పుకోలేనని భావిస్తూ, కంటి సంరక్షణ అవసరమున్నవారిని కేంద్రానికి తీసుకువస్తానని వాగ్దానం చేస్తున్నారు. మునుపు చూడలేకపోయిన ముగ్గురు పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలు ఇకపై అంధులు కారని ఎంతో సంతోషిస్తున్నారు. భారతదేశంలోని ఎల్విపిఇఐ నుంచి వచ్చి తృతీయశ్రేణి నేత్ర సంరక్షణను అందిస్తూ, ఆఫ్రికాలోని లైబీరియాలో నవ్వులను విస్తరింపజేస్తున్న సందర్శక డాక్టర్లకు ఈ రోగుల ముఖాలపై ఆనందభరిత చిరునవ్వులే పారితోషికం.

గత సంవత్సరం జూలై 2017లో ప్రారంభించబడిన ఈ కేంద్రంలో ప్రతిరోజూ నాణ్యమైన నేత్ర సంరక్షణా సేవలను అందుకుంటూ, సంతోషంగా ఉన్న ఇటువంటి రోగులు ఎంతోమంది ఉన్నారు. అక్కడ శాశ్వతంగా నియోగించిన బృందానికి అదనంగా క్లిష్టమైన కేసుల చికిత్సకొరకు ఎల్విపిఇఐనుంచి సబ్-స్పెషాలిటీ డాక్టర్లు సమయానుక్రమంగా కేంద్రాన్ని సందర్శిస్తూ ఉంటారు. స్థాపించిన తదుపరి తొమ్మిది నెలలలో కేంద్రంలో 6495 ఔట్ పేషంట్లను పరీక్షించి, 478 శస్త్రచికిత్సలు చేసారు.

## దేవీచరణ్‌కు ఇకపై మెరుగైన భవిష్యత్తును ఆకాంక్షిస్తున్న తల్లి





ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లా వీరవల్లి గ్రామానికి చెందిన శ్రీదేవి కొలుసు మూత్రపిండ వైఫల్యానికి భర్తను కోల్పోయింది. ఇతరుల బట్టలు కుడుతూ ఒంటరిగా తన ఇద్దరు పిల్లలనూ పెంచుకుంటోంది. ఆమె 12 ఏళ్ళ కొడుకు దేవీచరణ్ చూపు సమస్యతో స్థితి మరింత కష్టతరమయింది. ప్రముఖ స్థానిక ఆసుపత్రులలోని ఒక ఆసుపత్రిలో డాక్టర్లు దీనికి ఏమీ చేయలేమని, బాబు జీవితకాలమంతా ఆ సమస్యతోనే బతకాలని చెప్పారు. నిరాధారమైన ఆర్థికస్థితి కారణంగా గుండెను గట్టిచేసుకుని, కనీసం బాబుకు కనీస పోషకాహారం మరియు విద్య దొరుకుతుందనే ఆశతో ఆమె దేవీ చరణ్‌ను ఒక అనాధాశ్రమంలో చేర్పించింది. లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్ మద్దతుతో ఎల్విపిఇఐ నిర్వహించిన ఒక కంటి పరీక్షా కార్యక్రమంలో దేవీచరణ్‌ను గుర్తించి, ఎల్విపిఇఐ విజయవాడ ప్రాంగణానికి పంపారు. కంటి రెటీనా సమస్య గుర్తించి, అతనికి శస్త్రచికిత్స చేసారు. ఇప్పుడు అతను చూడగలడు. అతని తల్లి ముఖంలో సంతోషాన్ని, దేవీచరణ్ భవిష్యత్‌పట్ల ఆమె ఆశను చూడటం ఎంతో తృప్తికరంగా ఉన్నది. “ఈ బ్రహ్మాండమైన సహాయానికి ఈ సంస్థకు నేను ఋణపడి ఉంటాను” అన్నారు శ్రీదేవి సంతృప్తిగా.

నేను నా శస్త్రచికిత్స విషయంలో చాలా భయపడ్డాను. కానీ డా మిలింద్ నాయక్ నన్ను ప్రోత్సహిస్తూ నా భయాలనూ తొలగించారు. ఆయన ఎంతో తెలివైన, నైపుణ్యమున్న, మర్యాదపూర్వక, సహాయకారి అయిన వ్యక్తి. నా శస్త్రచికిత్స చాలా బాగా జరిగింది. నాకున్న నొప్పి, అసౌకర్యం ఇప్పుడు లేవు. ఎల్విపిఇఐలో అందరికీ నా ధన్యవాదాలు. మీరు చాలా మంచిపని చేస్తున్నారు! – ఉమేష్ అశోక్ బవిస్కర్

ఉమేష్ బాధాకరమైన, అంధత్వమున్న కంటికి చికిత్సైన ఎవిసరేషన్ శస్త్రచికిత్స చేయించుకున్నారు.